03052024-MAI-04_Layout 1 5/3/2024 3:25 AM Page 1

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

వైద్యానికి చికిత్స

'అన్నీ వేదాల్లోనే ఉన్నాయిష' అన్నట్టుగా 'ఆయుర్వేదమే సర్వరోగ నివారిణి' అనే ధోరణి ఇటీవలి కాలంలో బాగా ప్రాచుర్యంలోకి వచ్చింది. ఏది అచ్చమైన ప్రాచీన ఆయుర్వేదమో, ఏది టక్కుటమార చిట్కా వైద్యమో కనిపెట్టడం కష్టమైపోయింది. దీంతో నమ్మేవాడికి నమ్ముకున్నంత, అమ్మే వాడికి అమ్ముకున్నంత అన్నట్టుగా తయారైంది పరిస్థితి. పైగా ఆయుర్వేదం మంచిది, అల్లోపతి చెడ్డది అనే భావన కూడా చాపకింద నీరులా వ్యాపిస్తున్నది. ఈ భావన వెర్రితలలు వేస్తే ఏం జరుగుతుందో మనకు పతంజలి ఆయుర్వేద ఉత్పత్తుల వివాదంలో తేటతెల్లమైంది. సామాజిక ఉద్యమకారుడిగా, యోగ ప్రచారకుడిగా ప్రసిద్ధుడైన బాబా రాందేవ్ అలోపతి వైద్యానికి వ్యతిరేకంగా చేసిన వ్యాఖ్యలు అయన మెడకు చుట్టుకున్నాయి. ముఖ్యంగా కొరోనిల్ ఔషధం చుట్టూ అల్లుకున్న ప్రచారం తీవ్రమైన తల వంపులు తెచ్చిపెట్టింది. చివరికి సర్వోన్నత న్యాయస్థానం తాఖీదుల మేరకు ప్రముఖ పత్రికల్లో క్షమాపణ ప్రకటనలు విడుదల చేయాల్సి వచ్చింది.

'వైద్యో నారాయణో హరిః' అని గౌరవించే దేశం మనది. ప్రాచీనకాలంలోనే శుశ్రుతుడు, చరకుడు ప్రామాణిక వైద్య గ్రంథాలు రాసిపెట్టిన భారతదేశంలో వైద్యం ఎదుర్కొంటున్న గందరగోళ పరిస్థితికి పతంజలి వివాదం అద్దం పట్టింది. ఒకప్పుడు ఊరూరా ఓ వైద్యుడు ఉండేవాడు. దేశవాళీ పద్ధతుల్లో చికిత్సలు చేస్తూ రోగాల నుంచి ప్రజలకు ఉపశమనం కలిగించేవాడు. వలసపాలన పుణ్యమాని ఆయుర్వేదం, సిద్ధ, యునానీ వంటి స్వదేశీ వైద్యవిధానాలు క్రమంగా వెనుకతట్టు పట్టి అల్లోపతి పైచేయి సాధించడం కొంతవరకు ఈ పరిస్థితికి కారణం. పరిశోధన, అభివృద్ధిలో ముందుకు దూసుకుపోతూ, ఆధునిక ముద్రతో అల్లోపతి ధాటిగా నిలబడగలిగింది. భారతీయ వైద్యవిధానాల్లో ఆ స్థాయి పరిశోధనలు జరగలేదన్నది వాస్తవం. దీంతో అవి అశాస్త్రీయమైనవనే భావన వ్యాప్తిలోకి వచ్చింది. ఒక అప నమ్మకం పెంచుతూ పోయారు. అలాగని అల్లోపతి కడిగిన ముత్యంలా తళతళ మెరుస్తున్నదని కాదు. ఔషధాల విషయంలో ఎన్నెన్నో వివాదాలు ఉండనే ఉన్నాయి. వైద్య ప్రమాణాలపై కఠిన నియంత్రణ అమలులో ఉండే పాశ్చాత్య దేశాల్లో అల్లోపతి ఔషధాలపై కుప్పతెప్పలుగా కేసులుండటమే ఇందుకు నిదర్శనం. అనేక అభివృద్ధి చెందిన దేశాల్లో నిషేధించిన మందులు ఇండియాలో బాహాటంగా వైద్యులు సిఫారసు చేస్తారనే అపప్రథ మొదటినుంచీ ఉండటం తెలిసిందే.

వైద్య విధానాల మధ్య వివక్ష లేదా అంటే అది అర్థరహితమైన విషయం. సమ్మిశితత్వమే శ్రేయస్కరం. అత్యవసర చికిత్సలకు అల్లోపతి, ఉదర సమస్యలకు ఆయుర్వేదం, దీర్ఘవ్యాధులకు హోమియోపతి.. ఇలా ఒక్కో రకం రుగ్మతలకు ఒక్కో విధానం బాగా పనిచేస్తుందని కొందరు నమ్ముతారు. కానీ అలోపేతికి, ఇతర విధానాలకు మధ్య సయోధ్య కుదరదు. ఇతర విధానాలను గుర్తించేందుకు అల్లోపతి నిరాకరించడమే అందుకు కారణం. ఈ నేపథ్యంలో డబ్బులుంటే అల్లోపతి.. లేకపోతే ఆయుర్వేద ముసుగులో సాగే చౌక వైద్యం అన్న తీరుగా వైద్యం నడుస్తున్నది. భారత దేశానికి ఆచరణాత్మక వైద్య అనుసంధానంపై, ఆరోగ్య పరామితులపై ఇప్పటికీ పెద్దగా ఆలోచన జరుగుతున్న దాఖలాలు కనిపించడం లేదు. డాటా అందుబాటులో లేకపోవడం మరో సమస్య. దీనివల్ల స్వదేశీ వైద్య పద్ధతులు లెక్కలోకే రాకుండా పోతున్నాయి. పతంజలి వివాదాన్ని ఆసరాగా చేసుకొని వైద్య పరిశోధక సంస్థలు, ప్రభుత్వం ఇకనైనా దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించాలి. స్వదేశీ వైద్య విధానాన్ని సమూలంగా సంస్కరించి, సమున్నతంగా నిలబెట్టేందుకు ప్రచార ఆర్భాటాల నుంచి విముక్తి కలిగించి నిజమైన ఆయుర్వేద వైద్యాన్ని వ్యాప్తి చేసేందుకు చర్యలు చేపట్టాలి.

కుమ్మక్కు.. కుట్ర.. కుతంత్రం!

ఎన్నికల యుద్ధ సందర్భంలో 'కుమ్మక్కు', 'బీ టీం' అంటూ యథేచ్ఛగా పేలుతున్నయి కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న రెండు జాతీయ పార్టీలు. ఈ రెండు పార్టీల టార్గెట్ బీఆర్ఎస్సే. వాటిని ఆ స్థాయిలో హడలెత్తిస్తున్నరు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్. ఆయన సభలకు వస్తున్న భారీ స్పందన ఆ రెండింటికి నిదురను దూరం చేస్తున్నది. అందుకే, ఆ రెండు పార్టీలు కలిసి నాటకాలు ఆడుతున్నయి. వాటి సంయుక్త దర్శకత్వంలో నాటకాన్ని రక్తి కట్టిస్తున్నది ఎన్నికల కమిషన్. కాబట్టే, 'పేగులు మెడలో వేసుకుంటా, డ్రాయర్ లాగేస్తా, కనుగుడ్లు పీకేస్తా' వంటి వల్గర్, చీప్ భాష మాట్లాడిన రేవంత్‌రెడ్డిని వదిలేసి.. కాంగ్రెస్ అబద్ధపు హామీలను, విధానపరమైన నిర్ణయాలను ప్రజల దృష్టికి తీసుకువెళ్లిన కేసీఆర్‌పై 48 గంటల నిషేధం విధించిన 'భారత జాతీయ కాంగ్రెస్ జనతా ఎన్నికల కమిషన్' చెప్తున్నది ఎవరు ఎవరితో కుమ్మక్కు అవుతున్నరో అని.

శ్రీశైల్ రెడ్డి పంజుగుల
90309 97371

'మేం బీజేపీలో చేరము. కానీ, బయటి నుంచి మద్దతు ఇస్తం' అన్న రీతిలో ఎన్నికల కమిషన్, ఈడీ, ఐటీ కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నయి. తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీకి ఇబ్బందులు సృష్టించే విషయంలో కాంగ్రెస్, బీజేపీ కలిసి పని చేస్తున్నాయనడానికి వంద ఉదాహరణలు చెప్పవచ్చు. ఒకటే మద్యం కేసులో కేజ్రీవాల్‌పై ఒక రకంగా, శరత్ చంద్రారెడ్డిపై ఒక రకంగా, కల్వకుంట్ల కవితపై ఒకరకంగా వ్యవహరిస్తున్నయి రెండు జాతీయ పార్టీలు. తెలంగాణలో ఎన్నో మున్సిపాలిటీల్లో అవిశ్వాస తీర్మానాలతో బీఆర్ఎస్‌ను దించి కాంగ్రెస్-బీజేపీ కలిసి గద్దెనెక్కుతున్నయి.

'మోదీ గారు' అధీర్ బాబు అని పిలిచే కాంగ్రెస్ సీనియర్ నేత అధీర్ రంజన్ చౌధురి బెంగాల్‌లో తమ మిత్ర పక్షమైన టీఎంసీకి కాకుండా బీజేపీకి ఓట్లేయాలని చెప్పడం కుమ్మక్కుకు పరాకాష్ఠ. కేరళలో తమ మిత్రపక్ష సీఎం పినరయి విజయన్‌ను రేవంత్‌రెడ్డి తిట్టి రావడం ఈ కుమ్మక్కులో భాగమే. సిగ్గూ ఎగ్గూ లేని తెలంగాణ వామపక్ష నాయకులు కిమ్మనలేకపోవడం అతి అధమస్థాయి కుమ్మక్కు. ఏ మాత్రం విలువలు లేని రాజకీయం!

నరేంద్ర మోదీకి తాను చోటే భాయ్ అని రేవంత్‌రెడ్డి తెలివి తక్కువగా ఏమీ చెప్పలేదు. బాహాటంగానే మోదీతో, అదానీతో అంటకాగారు. 'నేను ఏబీవీపీ మనిషిని. మీకు నమ్మదగినవాడిని. తెలంగాణలో మీ అవసరాలు నేను, నా అవసరాలు మీరు తీర్చడంపై సీరియస్‌గా ఉందాం' అని ఆయన మోదీతో, ఆర్ఎస్ఎస్ పెద్దలతో చెప్పి ఉంటారని అనడానికి మనకెవరికీ సాక్ష్యాధారాలు అవసరం లేదు. రేవంత్ ప్రతి మాటా, ప్రతి చేతా అదే స్పష్టం చేస్తున్నది. బీజేపీ గెలుపు కోసం కనీసం ఆరేడు స్థానాల్లో బలహీనమైన అభ్యర్థులను నిలిపారు రేవంత్‌రెడ్డి.

రాహుల్‌గాంధీని, తెలంగాణ కాంగ్రెస్‌నూ పీకల్లోతు పాతిపెట్టడానికి స్కెచ్ వేశారు రేవంత్. తెలివి తక్కువ కాంగ్రెస్ అధిష్ఠానానికి ఇవేవీ పట్టవు. మెప్పించే మాటలు, మురిపించే మూటలు చాలు వారికి. పాపం, పార్టీ జెండాయే జీవితం అనుకునే నాన్ సీరియస్ తెలంగాణ కాంగ్రెస్ సీనియర్ల ఊహలకు కూడా అందరు రేవంత్.

తెలంగాణ బీజేపీ పరిస్థితి కూడా అచ్చం కాంగ్రెస్‌లాగే ఉన్నది. 'బండి సంజయ్, కిషన్‌రెడ్డి లాంటి వాళ్లను మా అధిష్ఠానం పట్టించుకోదు. టాప్ ముగ్గురు, నలుగురు జాతీయ నాయకులే అన్నీ స్వయంగా చూస్తరు, చేస్తరు. కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లకు ముఖ్య విషయాలు ఏమీ చెప్పరు' అని బీఎల్ సంతోష్ తరపు మనుషులు మొయినాబాద్ ఫామ్‌హౌజ్‌లో చెప్పిన విషయం మనందరం ఆడియోల్లో విన్నం.

కాంగ్రెస్, బీజేపీలపై సాధికారికంగా, గణాంక సహితంగా చెలరేగిపోయే బీఆర్ఎస్ నాయకుడు మన్నె క్రిశాంక్‌ను నిర్బంధించిన్రు. నిషేధాలు, నిర్బంధాలు ఉద్యమకారులకు నిజమైన అభినందనల లాంటివి. వారి పనితీరును గౌరవించటం వంటివి. బూడిద నుంచి భగ్గుమని లేచి ఆకాశానికి ఎగిరే ఫీనిక్స్ పక్షిలా లేస్తరు నాయకులు. కేసీఆర్ చెప్పినట్టు 48 గంటల నిర్బంధానికి ప్రతీకారం 96 గంటల నిరసనల రూపంలో చూపిస్తరు ప్రజలు.

కేసీఆర్‌కు పొత్తూ, కుమ్మక్కూ లాంటివి ఉంటే గింటే అవి ప్రజలతోనే. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల జీవనప్రమాణాల పెంపు గురించి ఆలోచించే నాయకునికి, ఆయన పార్టీకి చిల్లర రాజకీయాలు అవసరం లేదు.

రేవంత్ నేతృత్వంలోని కాంగ్రెస్‌కు, బీజేపీకి మరొక సామీప్యం కూడా ఉన్నది. దేవుని పేరుతో ఓట్లు అడగటం బీజేపీ నీచ రాజకీయం అయితే, దేవునిపైనే ఒట్టు వేయడం రేవంత్ చిల్లర రాజకీయం. అయితే ఇవన్నీ చైతన్యవంతమైన తెలంగాణ సమాజం ముందు నడవవు. తన బూటకపు ఒట్టల్ల కీడు కలుగకూడదనే రేవంత్ తన కుటుంబంపై ఒట్టు వేయడం లేదని, దేవుడు తేరగా దొరికిండు కదాని ఆయనపై ఒట్టు వేస్తున్నరని ఊర్లల్లో సామాన్య జనం మాట్లాడుకుంటున్నరు. దేవునిపై ఆ రెండు పార్టీలకు ఉన్న దైవ భక్తి, పాప భీతి ఏపాటిదో అర్థం అవుతున్నది కదా? మాధవునితోనే నాటకాలు ఆడేవారికి మానవులు ఒక లెక్కా?

అంతిమంగా చెప్పదలచుకున్నది ఒక్కటే: 'మోదీ, రేవంత్ కుమ్మక్కుల గురించి ఆలోచించండి, మీ భవిష్యత్తు పట్ల జాగరూకులై ఉండండి' అని తెలంగాణ బీజేపీ, కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు కూడా నేను సూచిస్తున్నా.

ఇక, విజ్ఞులైన తెలంగాణ జనానికి: తెలంగాణలో బీఆర్ఎస్ మొదటి స్థానంలోకి వేగంగా దూసుకువస్తున్నదని, కాంగ్రెస్ మూడో స్థానానికే పరిమితం కానున్నదని జాతీయ సర్వేలు సైతం చెప్తున్నయి. 8-10 స్థానాల వరకు బీఆర్ఎస్ గెలువబోతున్నది. పదేండ్ల ప్రగతి తెలంగాణను ఐదు నెలల్లోనే సర్వనాశనం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల గ్రామగ్రామాన నిరసనలు వెల్లువెత్తుతున్నవి. ఆ పార్టీ అభ్యర్థులను ప్రజలు నిలదీస్తున్నరు. హామీలు, గ్యారెంటీలు అన్నీ మోసమని గ్రహించిన్రు. బీఆర్ఎస్ సభలకు పోటెత్తుతున్నరు. అందుకే ఆ రెండు పార్టీలకు దడ పుట్టి నీచ రాజకీయాలకు తెరలేపుతున్నయి. ఈ తరుణంలో బీఆర్ఎస్‌ను, తెలంగాణను దెబ్బతీసే కుమ్మక్కు ఎత్తుగడలపై తస్మాత్ జాగ్రత్త.



ఓటే సమాధానం!

అదేదో తెలుగు సినిమా డైలాగ్‌లాగా 'నాకు నేనే పోటీ, నాతో నేనే పోటీ, నాకు ఎవరు ఎదురొచ్చినా తొక్కిపడేస్తా' అనే విధంగా ప్రధాని మోదీ వ్యవహరిస్తున్నారు. అధికారాన్ని దక్కించుకోవడం కోసం, దాన్ని నిలబెట్టుకోవడం కోసం ఆయన ఎంత దూరమైనా వెళ్తారనడంలో సందేహం లేదు. తన లక్ష్యాన్ని చేరుకోవడానికి మొన్నటివరకు మతాల మధ్య వైషమ్యాలు పెట్టడానికి కూడా ఆయన వెనుకాడేవారు కాదు. అదీ కుదరకపోతే ప్రతిపక్ష పార్టీల నేతలను ఈడీ ద్వారా జైల్లో పెట్టించేవారు. కానీ, ఇప్పుడు కుర్చీ కోసం ఏకంగా ఎన్నికల్లో పోటీ చేస్తున్న ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులనే మింగేస్తున్నారు! మొన్న ఖజురహో, నిన్న సూరత్, నేడు ఇండోర్. మరి రేపు మరొకరు మోదీ అధికార దాహానికి బలి కావాల్సిందేనా?

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా గొప్పలు చెప్పుకొనే మన దేశంలో అసలు ప్రతిపక్షం అనేది ఉండకూడదా? ఒకవేళ మోదీ మరోసారి అధికారం చేపడితే ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నట్టు నిజంగానే దేశంలో ఇవే చివరి ఎన్నికలు కానున్నాయా? అంటే ఔననే సమాధానమే వినిపిస్తున్నది. ఇప్పటినుంచే అందు కనుగుణంగా పరిణామాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం దేశంలో జరుగుతున్న లోక్‌సభ ఎన్నికల్లో ఎన్నో దారుణాలు చోటుచేసుకుంటున్నాయి.

సూరత్‌లో రాజకీయ నాటకీయ పరిణామాల మధ్య కాంగ్రెస్ అభ్యర్థి నీలేశ్ కుంభాని నామినేషన్‌ను తిరస్కరించడం వివాదాస్పదంగా మారింది. నీలేష్ కుంభాని నామినేషన్ తిరస్కరణకు గురికావడం, ఇతర ఇండిపెండెంట్లు బరిలో నుంచి తప్పుకోవడంతో బీజేపీ అభ్యర్థి ముఖేష్ దలాల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దీంతో ఆ నియోజకవర్గంలోని దాదాపు 18 లక్షల మంది ఓటర్లకు తమ ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం లేకుండాపోయింది. ఏడు దశాబ్దాల సూరత్ లోక్‌సభ చరిత్రలో ఇలా జరగడం ఇదే మొదటిసారి. సూరత్‌లో మొత్తం 15 నామినేషన్లు దాఖలయ్యాయి. వీటిలో నీలేశ్ కుంభాని సహా 6 నామినేషన్లను తిరస్కరించారు. అనంతరం 8 మంది స్వతంత్ర అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. ఇదంతా బీజేపీ ప్రోద్బలంతోనే జరిగిందని కాంగ్రెస్ ఆరోపించింది. నామినేషన్లను ఉపసంహరించుకోవాలని స్వతంత్ర అభ్యర్థులను కోరినట్టు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వినోద్ తావడే చెప్పడం చూస్తే బీజేపీ నిర్వాకమని తెలుస్తున్నది.

కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతుగా చేసిన సంతకాలు నకిలీవని చెప్తున్నప్పటికీ అది అనుమానాస్పదంగా మారింది. నీలేశ్ కుంభాని మద్దతుదారులుగా సంతకాలు పెట్టినవారంతా ఆయన కుటుంబ సభ్యులు, సన్నిహితులే. సంతకం పెట్టినవారిలో జగదీశ్.. నీలేశ్‌కు బావ వరుస అవుతారు. ధ్రువిన్ మేనల్లుడు. రమేశ్ పోల్రా ఆయన బిజినెస్ పార్ట్‌నర్. ఆ ముగ్గురు నీలేశ్‌కు ఆప్తులే అయినప్పటికీ వారు కలెక్టరేట్‌కు వెళ్లి నామినేషన్లపై ఉన్నవి తమ సంతకాలు కావని ఎందుకు ప్రమాణపత్రం ఇచ్చారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

తాజాగా మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి అక్షయ్ కాంతి బమ్ తన నామినేషన్‌ను ఉపసంహరించుకొని బీజేపీలో చేరడం సంచలనంగా మారింది. అక్షయ్ కాంతి బమ్ నామినేషన్‌ను ఉపసంహరించుకోవడానికి సరిగ్గా మూడు రోజుల ముందు నాటకీయ పరిణామాలు జరిగాయి. 17 ఏండ్ల కిందటి కేసులో కోర్టుకు హాజరు కావాలని ఆయనకు నోటీసులు అందాయి. ఆ తర్వాత ఆయన బీజేపీలో చేరారు. దీంతో ఇదంతా కాకతాళీయంగా జరిగిందా? లేదా ఏదైనా రాజకీయ కుట్ర దాగి ఉందా అనే అనుమానాలు కలుగుతున్నాయి.

ఇండోర్‌లో 1989 నుంచి బీజేపీ అభ్యర్థులే ఎంపీలుగా గెలుస్తున్నారు. 1989-2014 వరకు సుమిత్రా మహాజన్ ఎంపీగా ప్రాతినిధ్యం వహించగా.. 2019లో శంకర్ లల్వానీ ఐదు లక్షల మెజారిటీతో గెలిచి రికార్డు సృష్టించారు. అంత భారీ మెజారిటీ వచ్చిన స్థానంలో ప్రత్యర్థి పార్టీకి చెందిన అభ్యర్థి నామినేషన్‌ను విత్‌డ్రా చేయించాల్సిన అవసరం ఏమొచ్చింది. ఓటమి భయంతోనే బీజేపీ ఇలా చేస్తున్నదనేది స్పష్టంగా తెలుస్తున్నది. ఓటమి భయంతోనే అనేక చోట్ల బీజేపీ ఇలాంటి ప్రయత్నాలు చేస్తున్నదనే అనుమానాలు కలుగుతున్నాయి. ఈ క్రమంలోనే ఖజురహోలో సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థి మీరా యాదవ్ నామినేషన్ తిరస్కరణకు గురైంది. దీంతో చేసేదేమీ లేక ఆల్ ఇండియా ఫార్వార్డ్ బ్లాక్ అభ్యర్థి కేవీ ప్రజాపతికి ఇండియా కూటమి మద్దతు ప్రకటించింది.

ఎవరు పోటీలో ఉండాలో ఎవరు ఉండకూడదో బీజేపీ నిర్ణయిస్తుండటం ఆందోళనకరం. ఇది ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. పోటీ ఉండకూడదని అనుకున్నపుడు ఎన్నికలు నిర్వహించడం ఎందుకు? కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని వృథా చేయడమెందుకు?

ఓటు ద్వారానే ప్రజాస్వామ్యం మనుగడ సాగిస్తుంది. అసలు పోటీయే లేకుండా బలవంతపు ఏకగ్రీవాలు దేశానికి మంచిది కాదు. ఒకవేళ మూడోసారి మోదీ సర్కార్ అధికారంలోకి వస్తే.. దేశంలో ఇవే చివరి ఎన్నికలు అయినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు.

భరత్ చౌహాన్
90306 66999

ఓటు అనేది హక్కు మాత్రమే కాదు, బాధ్యత కూడా. ఆ బాధ్యతను సక్రమంగా నిర్వర్తించాల్సిన సమయం ఆసన్నమైంది. ప్రజాస్వామ్యాన్ని రక్షించేందుకు, రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు ప్రతిఒక్కరూ నడుం బిగించాలి. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తున్న వారికి తమ ఓటుతో సమాధానం చెప్పాలి.

మోదీ.. 27 కేసులు, 1 నోటీసు, చర్య సున్నా

'మీ విధి నిర్వహణలో మీరు విఫలమయ్యారని నేను ఏప్రిల్ 24న హెచ్చరించాను. ఎన్నికల సంఘం పక్షపాత ధోరణితో, వివక్షతో వ్యవహరిస్తున్నదనేది నా ఆరోపణ'
- 2014, మే 8న బీజేపీ ప్రధాని అభ్యర్థి నరేంద్ర మోదీ

2019 నుంచి ఇప్పటివరకు విపక్ష పార్టీలు ప్రధాని నరేంద్ర మోదీ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినట్టు కనీసం 27 సార్లు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశాయి. ఈ కేసుల్లో దేని మీదా ఇప్పటివరకు ఎన్నికల సంఘం నికరమైన చర్య తీసుకోలేదు. ఈ ఫిర్యాదుల్లో విద్వేష ప్రసంగం, ఓట్లు పొందేందుకు సైనిక దళాలను ఉపయోగించుకోవడం, మతం పేరు మీద ఓట్లు అడగడం, ప్రభుత్వ మంత్రిత్వ శాఖలను ప్రధాని ఎన్నికల సభల ప్రసంగాల తయారీకి ఉపయోగించుకోవడం మొదలైనవి ఉన్నాయి.

హిమాన్షి దహియా

మొట్టమొదటిసారిగా ఎన్నికల సంఘం ఏప్రిల్ 25న బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డాకు ఆ పార్టీ స్టార్ క్యాంపెయినర్ ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన గురించి తెలియజేసే నోటీసులు పంపింది. అయితే ఇక్కడో చిన్న కిటుకు ఉంది. ఆ నోటీసులో కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ ఎంఎల్ (లిబరేషన్) అందజేసిన ఫిర్యాదుల గురించిన ప్రస్తావన అయితే ఉంది కానీ, ప్రధాని పేరు ఎక్కడా పేర్కొనలేదు. ఒక ఎన్నికల సభలో ప్రధాని నరేంద్ర మోదీ మతావేశంతో కూడిన ప్రసంగం చేశారనీ, కాంగ్రెస్ ఒకవేళ అధికారంలోకి వస్తే సంపదను చొరబాటుదారులకు పంచేస్తుందని ఆ ప్రసంగంలో అన్నారని ఆయా రాజకీయపక్షాలు తమ ఫిర్యాదులో ఆరోపించాయి.

'కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు వారు దేశంలోని సంపదలపై ముస్లింలకే మొదటి హక్కు ఉంటుందని చెప్పారు. అంటే వారు దేశ సంపదను ఎక్కువ పిల్లలు కనేవారికి, చొరబాటుదారులకు పంచుతారని అర్థం. ఇదంతా మీకు ఆమోదయోగ్యమా?' అని ప్రధాని రాజస్థాన్‌లోని బాన్సువాడ జిల్లాలో ఏప్రిల్ 21 ఆదివారం నాడు జరిగిన సభలో సభికులను ఉద్దేశించి ప్రశ్నించారు.

ఆయన ఇంకా ఇలా అన్నారు.. 'మన తల్లులు, చెల్లెళ్ల ఒంటి మీద ఉన్న బంగారానికి సంబంధించిన సమాచారాన్ని సేకరించి, లెక్కవేసి దానిని పంచేస్తామని కాంగ్రెస్ మ్యానిఫెస్టో అంటున్నది. సంపదపై మొదటి హక్కు ముస్లింలకు ఉంటుందని మన్మోహన్ సింగ్ సర్కార్ ఇదివరకే అన్నది. సోదర, సోదరీమణులారా ఈ అర్బన్ నక్సల్ ఆలోచనలు మీ మెడలో ఉండే మంగళసూత్రాన్ని కూడా వదిలిపెట్టవు, వారు అంతదాకా వెళ్తారు.'

ఎన్నికల ప్రవర్తన నియమావళిలోని సెక్షన్ (1) ఏమంటుందంటే: ఏ పార్టీ కానీ, అభ్యర్థి కానీ ప్రస్తుతం ఉన్నటువంటి విభేదాలను రెచ్చగొట్టడం లేదా విద్వేషాన్ని సృష్టించడం లేదా వివిధ కులాలు, సామాజికవర్గాలు, మతాలు, భాషావర్గాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా వ్యవహరించకూడదు.

బీజేపీని సదరు నోటీసుకు ఏప్రిల్ 29లోగా సమాధానం అందజేయాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. ప్రధాని నరేంద్ర మోదీ ఆ ప్రసంగం చేసిన బాన్సువాడ నియోజకవర్గంలో రెండో విడతలో భాగంగా ఏప్రిల్ 26 శుక్రవారం నాడు పోలింగ్ జరిగింది.

2019 నుంచి ఇప్పటివరకు విపక్ష పార్టీలు ప్రధానిపై అందజేసిన కనీసం 27 ఫిర్యాదులను 'ది క్వింట్' విశ్లేషించింది. ఇందులో అంశాలవారీగా చూస్తే... 8 రకాల ఉల్లంఘనలు జరిగినట్టు తెలుస్తున్నది.

విపక్షాలు చెప్పేదాని ప్రకారం ఎన్నికల సంస్థ ఈ ఫిర్యాదుల్లో దేనిమీదా చర్య తీసుకోలేదు. సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి 2019 మార్చి 27న ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు రాసిన ఒక లేఖలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిన తర్వాత అయన చేసిన ప్రకటనకు సంబంధించి ఫిర్యాదు చేశారు.

'ప్రధాని తన ప్రసంగంలో డీఆర్డీవో శాస్త్రవేత్తలు ఉపగ్రహ విధ్వంసక క్షిపణిని విజయవంతంగా ప్రయోగించి, పరీక్షించడాన్ని ప్రస్తావించారు. ఎన్నికల ప్రచారం జరుగుతుండగా, అందులోనూ ప్రధాని కూడా ఒక అభ్యర్థిగా ఉన్నప్పుడు ఈ ప్రకటన చేశారు. ఇది స్పష్టంగా ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించడమే' అని ఏచూరి తన ఫిర్యాదులో తెలిపారు. ఆ ఫిర్యాదుపై ఎన్నికల సంఘం ఏర్పాటు చేసిన ఒక కమిటీ ప్రభుత్వ మీడియా దుర్వినియోగం అనేది జరగలేదని ఒక్క ముక్కలో తేల్చేసింది. ఎన్నికల సంఘం తన ఫిర్యాదును కొట్టివేయడంపై ఏచూరి స్పందిస్తూ, అధికారిక మీడియా దుర్వినియోగం అనే సంకుచిత పరిధికి కుదించడం ఫిర్యాదుపై సంకుచిత భాష్యం చెప్పడమేనని అన్నారు. ప్రసంగం ముగిసిన వెంటనే ప్రధాని కేవలం భూమి మీద, ఆకాశంలో మాత్రమే కాదు.. అంతరిక్షంలో కూడా నేను చౌకీదారును అని ప్రకటించుకున్నారు. ఆ తర్వాత దీనిపై ఎన్నికల సంఘం నుంచి ఎలాంటి స్పందన రాలేదు.

ఎన్నికల సంఘం, మోదీ పాలన: గతేడాది డిసెంబర్‌లో భారత పార్లమెంటు ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల చట్టం (2023)ను ఆమోదించింది. ఆ చట్టంలోని 7వ సెక్షన్ ప్రకారం ప్రధాని చైర్‌పర్సన్‌గానూ, కేంద్ర క్యాబినెట్ మంత్రి, ప్రతిపక్ష నేత సభ్యులుగా ఉండే ఎంపిక కమిటీ సిఫారసు మేరకు సీఈసీ, ఈసీలను రాష్ట్రపతి నియమిస్తారు. సుప్రీం కోర్టు అదివరకే ఆ కమిటీలో ప్రధాని, ప్రతిపక్ష నేత లేదా పార్లమెంటులోని అతిపెద్ద విపక్ష పార్టీ నాయకుడు, భారత ప్రధాన న్యాయమూర్తి సభ్యులుగా ఉండాలని ఆదేశించింది. (కానీ కేంద్రం దీనిని పాటించలేదు)

తమ పార్టీ గీతంలోని 'జై భవాని', 'హిందూ' అనే పదాలను తొలగించాలని ఎన్నికల సంఘం నుంచి తనకు ఏప్రిల్ 21న ఆదేశాలు వచ్చాయని మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, శివసేన (యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే చెప్పారు. ఆ ఆదేశాలు పాటించేందుకు ఠాక్రే నిరాకరించారు. తమకన్నా ముందుగా కర్ణాటక ఎన్నికల సందర్భంగా ఆంజనేయుని (జై బజరంగ బలీ) తలచుకుని ఈవీఎంను నొక్కాలని సూచించిన ప్రధాని నరేంద్ర మోదీపై, రాంలల్లా ఉచిత దర్శనం కావాలంటే బీజేపీకి ఓటు వేయాలన్న కేంద్ర హోంమంత్రి అమిత్‌షాపై చర్య తీసుకోవాల్సి ఉంటుందన్నారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో హనుమంతుని పేరు వాడుకోవడంపై కాంగ్రెస్ కూడా ఈసీకి ఫిర్యాదు చేసింది. ఎన్నికల కమిషన్ దీనిపై ఎలాంటి చర్యా తీసుకోలేదు. ప్రధానిపై పనౌతీ, పిక్‌పాకెట్, ధనవంతులకు రుణమాఫీ చేసేవాడనే ఆరోపణలు చేసినందుకు రాహుల్‌గాంధీకి ఎన్నికల సంఘం 2023 నవంబర్‌లో నోటీసులు పంపించింది. రాజకీయ ప్రత్యర్థులపై నిర్ధారితం కాని ఆరోపణలు చేయరాదని ఎన్నికల ప్రవర్తనా నియమావళి సూచిస్తున్నదని ఆ నోటీసులో రాహుల్‌కు గుర్తుచేసింది.

అంతకుముందు మితవాద బజరంగ్‌దళ్‌ను నిషేధిస్తామని కాంగ్రెస్ కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల మ్యానిఫెస్టోలో చేసిన హామీని ప్రధాని మోదీ దుయ్యబట్టారు. అలా చేయడాన్ని బజరంగ్ బలీ లేదా హనుమ